సాక్షి చిత్తూరు

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



పకడ్బందీగా శాంతిభద్రతల పరిరక్షణ

శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్టు కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ తెలిపారు. - 8లో



కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఎస్ఆర్‌పురం మండలంలో ఆక్రమణ తొలగింపుపై కలెక్టర్ ఆదేశాలను అధికారులు బేఖాతర్ చేశారు. - 8లో



సంప్రదాయబద్ధంగా 'తిరునాళ్ల'

రాజనాల బండలో సంప్రదాయబద్ధంగా తిరునాళ్ల నిర్వహించనున్నట్లు టీటీడీ ఏఈఓ మునికృష్ణారెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

బదిలీలకు 14 మంది అర్హులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ పరిధిలో బదిలీలకు 14 మంది అర్హులుగా జాబితా సిద్ధం చేశారు. అందులో ఒక సబ్‌రిజిస్ట్రార్, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు అటెండర్లు ఉన్నారు. ఈ క్రమంలో కోరుకున్న చోట పోస్టింగ్ కోసం పలువురు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది.

31న ఎస్ఎంసీ ఎన్నికలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పెండింగ్ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో అనివార్య కారణాల వల్ల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు పూర్తి కాకపోతే ఈ నెల 31వ తేదీన తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

విద్యా క్యాలెండర్ విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను డీఈఓ దేవరాజు శనివారం విడుదల చేశారు. అందులో నెలవారీ సాధారణ సెలవులు, పరీక్షల తేదీలను పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో మొత్తం 233 పని దినాలకు గాను, కనీస పని దినాలు 220కి తగ్గకూడదన్నారు. సంబంధిత పర్యవేక్షణ అధికారి ముందస్తు అనుమతితో ఐచ్ఛిక సెలవులు (ఆప్షనల్ సెలవులు), స్వయం నిర్ణాయక సెలవులు 3 వాడుకోవచ్చని వెల్లడించారు.

సమగ్రశిక్ష ఏపీసీ బదిలీ



పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ ఎస్పీడీ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన మాతృసంస్థ కో–ఆపరేటివ్ శాఖకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకటరమణారెడ్డి గత ఐదేళ్లుగా సమగ్రశిక్ష ఏపీసీగా పనిచేశారు. నాడు–నేడు, విద్యాకానుక, అదనపు తరగతి గదుల నిర్మాణం, అమ్మ ఒడి పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేశారు. ఈ క్రమంలో కొత్త ఏపీసీ వచ్చే వరకు వెంకటరమణారెడ్డి కొనసాగుతారని, తర్వాతే రిలీవ్ అవుతారని అధికారులు వెల్లడించారు.

రేపటి నుంచి క్రీడాదినోత్సవాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 26న ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మెసానికల్ స్టేడియంలో 9, 10 తరగతుల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించాలన్నారు. 28 జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో క్రీడాపోటీలు, 29న హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ర్యాలీ, 30న మెసానికల్ మైదానంలో క్రీడాకారులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేలా డీఎస్‌డీఓ బాలాజీ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

స్టోర్స్ ఏఈగా మోహన్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్ అవుట్‌డోర్ విభాగం ఏఈగా మోహన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు విడుదలైన ఉత్తర్వుల్లో ఇక్కడ పనిచేస్తున్న వివేకానందరెడ్డిని కార్పొరేట్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. వివేకానందరెడ్డికి ఈ చోట ఐదేళ్ల సర్వీసు పూర్తికాకముందే బదిలీ చేయడం చర్చనీయాంశమైంది.

ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా వసంతవాణి



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీగా వసంతవాణిని నియమిస్తూ డీఈఓ దేవరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. యాదమరి మండలం 14 కండ్రిగ ఉర్దూ జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఎస్‌జీఎఫ్ సెక్రెటరీగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. వసంతవాణి మాట్లాడుతూ జిల్లాలో అండర్–14, 17 క్రీడల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

మిలటరీ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షకు సెప్టెంబరు 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అవగాహన అవసరం



రోగుల ప్రాణాలు కాపాడాలనే సదుద్దేశంతో సేవలందించే వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. దీనిపై సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం. ఆడ, మగ పిల్లలకు చిన్నతనం నుంచి బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌తో పాటు సెక్స్ ఎడ్యుకేషన్ అందించాలి. అప్పుడే లైంగిక దాడులను అరికట్టేందుకు కొంత అవకాశముంటుంది. వైద్య వృత్తిలో రోగి ప్రాణం పోయేలా ఎవరూ వ్యవహరించరు. అనివార్య పరిస్థితుల్లో రోగులు మరణిస్తే దాడులకు తెగబడటం సమంజసం కాదు. ఈ దాడులను అరికట్టదానికి ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్లు ఏర్పాటు చేయాలి. తక్షణం స్పందించేలా చర్యలు చేపట్టాలి. అనుచితంగా ప్రవర్తిస్తే చట్టపరంగా నిందితులకు పడే శిక్షలు తదితరాలకు సంబంధించిన వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి.

– హారిక, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



పెట్రోలింగ్ తప్పనిసరి



ముందు మాదిరిగా సమాజం లేదు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. ముఖ్యంగా మహిళలకు భద్రత లోపించింది. ప్రధానంగా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై రోగులు, వారి తాలుకా బంధువులు దాడులకు తెగబడుతున్నారు. రోజూ రాత్రి పూట రెండుసార్లు పోలీస్ పెట్రోలింగ్ చేయాలి. జిల్లా ఆస్పత్రుల వద్ద పూర్తి స్థాయిలో పోలీసుల నిఘా ఉండాలి. సచివాలయ పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో వారి ద్వారా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందికి కొంత రక్షణ ఉంటోంది. మండల ప్రాంతాల్లో స్థానిక యువకులతో గస్తీ ఏర్పాటు చేయించాలి. సామాజిక దళంగా ఏర్పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– శ్రీనివాసరెడ్డి, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

భీకర బైకర్లు!





ట్రాఫిక్ రణగొణధ్వనులతో వాతావరణం ఇప్పటికే కలుషితమవుతోంది. ఈ క్రమంలోనే కొందరు ద్విచక్రవాహనదారులు సృష్టిస్తున్న భీకర శబ్దాలతో కాలుష్యం మరింతగా పెరుగుతోంది. బైక్‌లకు ఇష్టారాజ్యంగా సైలెన్సర్లు మార్చేసి హల్‌చల్ చేస్తున్నారు. గుండెలదిరే సౌండ్‌తో మోటార్‌సైకిల్ నడుపుతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారు. చిత్రవిచిత్రమైన ధ్వనులను వెలువరించే వివిధ రకాల పొగ గొట్టాలను తమ వాహనాలకు అమర్చుకుని జనం చెవులు పగలగొడుతున్నారు. ఈ స్థాయి శబ్దాలు ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. కోరి వ్యాధులను కొనితెచ్చుకోవడమేనని హెచ్చరిస్తున్నారు.

- ద్విచక్రవాహనాల నుంచి గుండెలదిరే ధ్వనులు
- వింత వింత శబ్దాలతో దడ పుట్టిస్తున్న మోటారుసైకిళ్లు
- సైలెన్సర్లు మార్చేసి రోడ్లపై చక్కర్లు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- అధిక మోతతో ప్రమాదమంటున్న నిపుణులు

అధిక శబ్దంతో ముప్పు ఇదీ..

100 డెసిబెల్స్
దాటిన శబ్దం గుండె జబ్బులున్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది

110 డెసిబెల్స్
చికాకు, చర్మంపై రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వణుకు మొదలవుతుంది.

120 డెసిబెల్స్
చికాకు, కోపంతో భరించలేని తలనొప్పి వస్తుంది.

160 డెసిబెల్స్
చెవుల్లోని వినికిడి కణాలు, నరాలు దెబ్బతింటాయి.

190 డెసిబెల్స్
కర్ణభేరి పగిలిపోతుంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారు.

పర్యావరణానికీ ఇబ్బంది



రాజసం, హోదా ఉట్టి పడేలా ఉండాలని బుల్లెట్ కొనుక్కునేవాళ్లు ఒకరు. కుర్రకారు క్రేజీగా కేటీఎం. 80వ దశకం నాటి ఆర్ఎక్స్–100 పై రోడ్డుపై వెళుతుంటే ఆ హాయే వేరు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు సమస్యంతా రూ.లక్షలు వెచ్చించి కొంటున్న ద్విచక్ర వాహనాల పొగ గొట్టాలను ఇష్టానుసారం మార్చేసి, రోడ్లపై వెళ్లే ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడమే. దీనికి తోడు బైకుల నుంచి వచ్చే వింత శబ్దాలతో పర్యావరణానికి కూడా ఇబ్బంది కలుగుతోంది. ఎదుటివారి పరిస్థితిని ఏమాత్రం పట్టించుకోకుండా రోడ్లపై తిరుగుతూ రోత పుట్టిస్తున్న వాళ్లపై పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోతే ఈ సమస్య మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా మనం 60 డెసిబెల్స్ శబ్దం వరకు వినగలం. అంతకంటే శబ్దం పెరిగేకొద్దీ ఒక్కో రకమైన వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది.

చట్టం చెబుతోంది ఇదీ..



ఒక వాహనం సైలెన్సర్ నుంచి నిర్ణీత డెసిబెల్స్ కంటే ఎక్కువ సౌండ్ వస్తే.. అది శబ్ద కాలుష్యం సృష్టించినట్టే. దీనికిగానూ మోటారు వాహన చట్టంలోని యాక్టు 1988 సెక్షన్ 190(2) ప్రకారం పోలీసులతో పాటు రవాణా శాఖ అధికారులు కేసు నమోదు చేయాలి. బైకు నడిపిన వ్యక్తికి రూ.10వేల జరిమానాతో పాటు, కేసు నమోదు చేసి కోర్టుకు పంపాలి. మళ్లీ రెండోసారి శబ్దకాలుష్యానికి కారణమైతే బైకు నడిపిన వ్యక్తికి జైలుశిక్ష విధించే అవకాశం కూడా ఉంది. ఇక మోటారు వాహనానికి కంపెనీ ఇచ్చిన భాగాలను మారిస్తే వారిపై ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 191 ప్రకారం కేసు పెట్టవచ్చు. కొందరు కంపెనీ సైలెన్సర్లు తీసేస్తుంటే, మరికొందరు మఫ్లర్‌లను తీసేసి తీవ్రమైన శబ్ద కాలుష్యం సృష్టిస్తురు. మూడేళ్ల క్రితం చిత్తూరులో ఈ తరహా సైలెన్సర్లు అమర్చిన వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. పొగ గొట్టాలను తొలగించి, రోడ్డు రోలర్‌తో తొక్కించారు. రెండోసారి పట్టుబడ్డవారిపై కేసులు నమోదు చేశారు. కానీ ప్రస్తుతం తమ కళ్లెదుటే వింత వింత శబ్దాలు చేస్తూ బైకర్లు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



సైలెన్సర్లను మార్చేసి ఇష్టానుసారం ప్రజలకు ఇబ్బందులు కలిగే శబ్దాలు చేయడం మంచిది కాదు. అసలు తల్లి దండ్రులు తమ పిల్లలకు ఏ వయసులో వాహనాలు ఇవ్వాలో తెలుసుకోవాలి. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు మార్చకుండా చూసుకోవాలి. ఎంవీ యాక్టు కింద ఇలాంటి వారికి భారీ జరిమానాలు విధిస్తున్నాం. ఇక మెకానిక్‌లు కూడా సైలెన్సర్లను మార్పు చేస్తే కఠిన చర్యలు తీసుకుని వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనుకాడం. సైలెన్సర్‌ను మార్పు చేయాలని ఎవరైనా మెకానిక్‌ల వద్దకు వస్తే, చేయమని కచ్చితంగా చెప్పండి. చట్ట పరిమితిలో లేని సైలెన్సర్లను విక్రయించేవారిపై కూడా చర్యలు తప్పవు. వీటి వల్ల ఎక్కడైనా ఇబ్బంది వస్తే డయల్–100 నంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చు.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

చిత్తూరు అర్బన్ : ఇటీవల ఏదో ఆటంబాంబు పేలితే వచ్చే పెద్ద పెద్ద శబ్దాలతో ద్విచక్రవాహన చోదకులు కొందరు చేస్తున్న స్టంట్లు ప్రాణాలపైకి తెస్తున్నాయి. రోడ్లపై మితిమీరిన వేగంతో.. చెవులకు చిల్లులు పడే శబ్దాలతో రోడ్లపై కొందరు కుర్రకారు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. ద్విచక్రవాహనాలు కొనే సమయంలో కంపెనీ ద్వారా వచ్చే సైలెన్సర్లు (పొగ గొట్టాలు) తొలగించి, వాటి స్థానంలో రోత పుట్టించే వాటిని అమర్చుకుని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ప్రధానంగా ఎన్‌ఫీల్డ్, కేటీఎం, ఆర్ఎక్స్–100 లాంటి ద్విచక్రవాహనాల్లో ఈ తరహా సైలెన్సర్లను అమర్చుకుని ప్రజల కర్ణభేరితో ఆడుకుంటున్నారు. ఇందుకోసం షార్ట్ బాటిల్. అంగఖార్, డబుల్ బేరల్, రెడ్ రూస్టర్. అబ్బో ఇలాంటి పేర్లు చాలానే ఉన్నాయి. ఇవన్నీ పలు రకాల బైకులకు అమర్చే సైలెన్సర్ల పేర్లు. బాటిల్ పగులగొట్టినట్లు శబ్దం వస్తే షార్ట్ బాటిల్. అడవి పంది అరచినట్లు శబ్దం వచ్చే పొగ గొట్టానికి వైల్డ్ బోర్ ఎగ్జాస్ట్. తుపాకీ పేలుస్తున్నట్లు శబ్దం వస్తే టెయిల్ గన్నర్. ప్రస్తుతం ఈ తరహా వింత శబ్దాలు చేస్తూ రోడ్లపై తిరిగే ద్విచక్ర వాహనాలతో సామాన్యుల చెవులు పగిలిపోతున్నాయి.

అనారోగ్యం తప్పదు



శబ్ద తరంగాలను మన చెవికి కావాల్సిన దానికంటే ఎక్కువ స్థాయిలో వింటే శారీరక, మానసిక వ్యాధులు వస్తాయి. అధిక శబ్దాలను వినడం ద్వారా చెవిలోని నరాలు దెబ్బతిని వినికిడి వ్యవస్థకు రక్తప్రసరణ నిలిచిపోతుంది. దీంతో శాశ్వతంగా వినికిడి లోపం ఏర్పడుతుంది. పైగా మానసికంగా ఒత్తిడి పెరిగి చిరాకు కలుగుతుంది. ఆ కోపాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, తెలిసినవాళ్లపై చూపిస్తుంటాం. దీంతో మానవ బంధాలు కూడా దెబ్బతింటాయి. ద్విచక్ర వాహనాలకు ఆయా కంపెనీలు ఇచ్చే సైలెన్సర్లను పెట్టుకోవడమే మంచిది. లేకుంటే అనారోగ్యం తప్పదు.

– పురుషోత్తం, వైద్య నిపుణుడు, చిత్తూరు ప్రభుత్వాసుపత్రి

పాపం పసివాడు

అమ్మ ఒడిలో హాయిగా సేదతీరేవాడు.. నాన్నా వేలు పట్టుకుని దర్జాగా తిరిగేవాడు.. తల్లిదండ్రులతో కలిసి నిశ్చింతగా సాగే బతుకును ఓ పేలుడు నాశనం చేసింది. ఇన్నాళ్లు నీడ నిచ్చిన ఇంటిని నిలువునా కూల్చేసింది. కష్టం తెలియకుండా పెంచి కన్నవాళ్లను దూరం చేసింది. లోటు లేకుండా చూసిన వాళ్లను కాటికి సాగనంపింది. చిరుప్రాయంలోనే జీవితంలో చీకట్లు నింపింది. కల్లాకపటం తెలియని మనసును భయాందోళనకు గురిచేసింది. చివరకు ఎవరూ లేని అనాథగా మిగిల్చింది. శుక్రవారం రాత్రి గంగవరం మండలం పసలమంద కాలనీలో సంభవించిన ప్రమాదం ఓ మూడేళ్ల బాలుడికి దయనీయమైన పరిస్థితిని తీసుకువచ్చింది. చూపరుల హృదయాలను కలచివేసింది.

- నల్లమందు పేలడంతో కుప్పకూలిన ఇల్లు
- మృత్యువాత పడిన తల్లిదండ్రులు
- అనాథగా మారిన మూడేళ్ల బాలుడు





పేలుడు తీవ్రతకు ధ్వంసమైన ఇల్లు (ఇన్‌సెట్) మృత్యువుని జయించిన బాలుడు అమిత్





మృతి చెందిన ఖాదర్‌బాషా, రిహానా

గంగవరం : గంగవరం మండలం మారేడుపల్లెకు సమీపంలోని పసలమంద కాలనీలో శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. అనుమతులు లేకుండా టపాసులు తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పేలుడు తీవ్రతకు ఖాదర్‌బాషా(40), రిహానా(36) దంపతులు మరణించారు. వారి కుమారుడు అమిత్(3) ప్రాణాపాయం తప్పించుకున్నాడు. ఈ క్రమంలోనే ఇంటి పక్కన కొట్టంలో కట్టేసిన ఓ ఆవు మృత్యువాత పడగా, మరో ఆవు తీవ్రగాయాలపాలైంది.

10కిలోమీటర్ల వరకు వినిపించిన శబ్దం

నల్లమందు పేలుడు శబ్దం సుమారు 10 కిలోమీటర్ల వరకు వినిపించింది. ఇంటి ముందు వేసిన రేకులు పక్క వీధిలో పడ్డాయంటే పేలుడు తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పలమనేరు నుంచి కూడా పలువురు పరుగున ఘటనాస్థలానికి చేరుకున్నారు. కూలిన ఇంటి పైకప్పు కింద నుంచి ఖాదర్‌బాషా దంపతులు, కుమారుడిని అతికష్టం మీద వెలుపలికి తీసుకువచ్చారు. అప్పటికి ఆ దంపతులు కొనప్రాణంతో ఉండడంతో పోలీసులు హుటాహుటిన తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వారు కన్నుమూశారు. అమిత్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. అయితే పసి ప్రాయంలోనే తల్లి దండ్రులను కోల్పోయి ఒంటరిగా మిగిలిన బాలుడిని చూసి కంటతడి పెట్టని వారు లేరు. దేవుడా ఎందుకు ఈ పసివాడికి ఇంతటి శిక్ష విధించావు అంటూ కలత చెందని వారు లేరు.

నల్లమందా.. గన్‌పౌడరా..?

ప్రమాద స్థలిని అగ్నిమాపకశాఖ అధికారి పెద్దిరెడ్డి శనివారం పరిశీలించారు. ఇంట్లో జరిగింది నల్లమందు పేలుడా.. లేక గన్‌పౌడర్‌నా అనేది ఫోరెన్సిక్ నివేదికలో తెలుస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

టీడీపీ నేత దౌర్జన్యం

శ్రీరంగరాజపురం : మండలంలోని ఆరిమాకులపల్లెలో ప్రసాద్‌బాబు అనే వ్యక్తిపై స్థానిక టీడీపీ నేత గుణశేఖర్‌నాయుడు దౌర్జన్యానికి దిగాడు. శనివారం ఈమేరకు 15 మంది రౌడీలతో కలిసి వెళ్లి బాధితుడి ఇంటిపై దాడి చేశాడు. మర్యాదగా ఇల్లు, స్థలం ఖాళీ చేయకుంటే చంపేస్తామంటూ బెదిరించాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్ట్

పుంగనూరు : జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలను అపహరిస్తున్న ముఠాను శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కర్ణాటకకు చెందిన మునిరాజు మురళి శివకుమార్ , ప్రసాద్, వినోద్ ముఠాగా ఏర్పడి పుంగనూరు, రామసముద్రం పెద్దపంజాణి, చిత్తూరు పూతలపట్టు, కాణిపాకంలో సుమారు 70 ట్రాన్స్‌ఫార్మర్లలో తీగలను చోరీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు

వేర్వేరుచోట్ల సారా విక్రేతల అరెస్ట్

గుడిపాల: మండలంలోని గట్రాళ్లమిట్ట, తిమ్మాపల్లెలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. గట్రాళ్లమిట్టలో అదుపులోకి తీసుకున్న బెంజిమన్ నుంచి 164 ప్యాకెట్లు, తిమ్మాపల్లెలో ఎడ్విన్ నుంచి 62 ప్యాకెట్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాడుల్లో జయరామ్, ఎబినేషన్, రామకృష్ణ, మంజునాథ్, మునితర్నం, సుందరం పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు : పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీకు చెందిన రాజు, రాంబాబు అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో 60 లీటర్ల సారాను పోలీసులు అరెస్ట్ చేశారు. దాడిలో సీఐ శ్రీనివాసులు,ఎస్‌ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సహాయకులతోనే..



రోగులతోపాటు వచ్చే సహాయకులు చాలామంది మద్యం మత్తులో ఉంటున్నారు. నానా హడావుడి చేయడంతో పాటు ప్రవర్తన సరిగ్గా లేకపోవడం వల్ల రోగులకు సేవలు అందించడం మరింత ఇబ్బందిగా మారుతోంది. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించడం లేదు. విసుగు చెంది అవుట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రోగులతో పాటు ఒక్కరు మాత్రమే సహాయకులుగా రావాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇది మాకు సెక్యూరిటీ పరంగా ఆందోళన పెంచుతోంది. దీనికి అడ్డకట్ట వేస్తే రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చు. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు పెట్టడంతోపాటు సెక్యూరిటీ పటిష్టంగా ఉండేలా చూడాలి. .గుంపులుగా వచ్చి ఇబ్బంది పెడితే డాక్టర్లకు విధి నిర్వహణ కష్టంగా ఉంటోంది.

– దినేష్‌రెడ్డి, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



భద్రత కల్పించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన చాలా బాధాకరం. ప్రభుత్వాస్పత్రుల్లో జూనియర్ నుంచి సీనియర్ వరకూ మహిళా వైద్యులు రాత్రిళ్లు కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ సమయంలో మహిళా వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి భద్రత కల్పించాలి. ఆస్పత్రిలో ఉండే సెక్యూరిటీ, మహిళా పోలీసులను వైద్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులుగాని, మత్తు పదార్థాలు సేవించి ఆస్పత్రిలోకి వస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతమే శ్రీరామ రక్ష అని అనుకుంటున్నాం. అందుకు తగ్గట్టు అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలి. డాక్టర్లపై దాడులను ఖండిస్తూ ప్రాణాలకు రక్షణ కవచంలా నిలవాలి.

– మోనిక, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

సంప్రదాయబద్ధంగా 'తిరునాళ్ల'

- 31 నుంచి రాజనాల బండలో ఉత్సవాలు
- ఏర్పాట్లపై చర్చించిన టీటీడీ ఏఈఓ మునికృష్ణారెడ్డి



పూజలు చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

చౌడేపల్లె : సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో రెండు రోజులపాటు నిర్వహించే తిరునాళ్లను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ఏఈఓ మునికృష్ణారెడ్డి తెలిపారు. శనివారం రాజనాల బండలో 13 గ్రామాలకు చెందిన ప్రజలు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. టీటీడీ పరిధిలోకి ఆలయం వచ్చిన తర్వాత తొలిసారి తిరునాళ్ల కావడంతో ఏర్పాట్లపై స్థానికులతో చర్చించారు. ఈనెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో రెండు రోజులపాటు అత్యంత వైభవంగా తిరునాళ్లని జరిపించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాట్లు, దేవరెద్దుల ఊరేగింపు, పోకు మాను బరుగుట, ఉట్లోత్సవం, పిల్లనగ్రోవులు, చెక్కభజన బృందం వారి కార్యక్రమాలపై చర్చించారు. ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. అనంతరం మేళతాళాల నడుమ గుడి ఎదుట మూడుసార్లు ప్రదర్శన నిర్వహించి, లక్ష్మీనరసింహస్వామి కొండ దిశగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ భాస్కర్, ఏఈ భాస్కర్ మూర్తి, గ్రామ పెద్దలు నాగభూషణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఓబులేసు, బాలాజి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, సుబ్బు, శేఖర్, నరసింహులు, సురేంద్ర, జయరామిరెడ్డి, నాగరాజ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

చిత్తూరు కార్పొరేషన్: తపాలా బిళ్లలను సేకరించే ఆసక్తి ఉన్న విద్యార్థులు సాల్కర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యారులు దరఖాస్తుకు అర్హులన్నారు. పాఠశాలలోని ఫిలాటరీ క్లబ్‌లో సభ్యుడిగా ఉండాలని, ఒకవేళ క్లబ్ లేకపోతే విద్యార్థికి ఫిలాటరీ డిపాజిట్ అకౌంట్ ఉండాలని వెల్లడించారు. పరీక్షల్లో కనీసం 60 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం సడలింపు కల్పించారని వివరించారు. తొలుత క్విజ్ నిర్వహిస్తామని, ఎంపికైన వారు ప్రాజెక్టు రిపోర్టు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. ఫైనల్‌గా అర్హత సాధించిన వారికి నెలకు రూ.500 చొప్పున సాల్కర్‌షిప్ అందజేయనున్నట్లు తెలిపారు. సంబంధిత వివరాలతో సెప్టెంబర్ 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు అందుబాటులోని తపాలా కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

శ్రీరంగరాజపురం : మండలంలోని పీపీ పురం గ్రామానికి చెందిన నీలమ్మకు స్థానిక టీడీపీ నాయకుడు అప్పలరాజు భూతగాదాలు ఉన్నాయి. ఆమె పొలంలోకి వెళ్లే ప్రభుత్వ భూమిని అప్పలరాజు ఆక్రమించుకున్నాడు. దీనిపై ఆమె పోలీసులకు సైతం ఫిర్యాదు చేసింది. ఫలితం లేకపోవడంతో ఈ నెల 21వ తేదీన కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించింది. దీనిపై కలెక్టర్ వెంటనే సమస్య పరిష్కరించి బాధితురాలు వెళ్లేందుకు ఆ భూమిలో బాట ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.ఈ క్రమంలో శనివారం తహసీల్దార్ అమర్‌నాథ్ తన సిబ్బందితో కలసి కబ్జాకు గురైన స్థలం పరిశీలించారు. అయితే అప్పలరాజుపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటేనే దారి ఏర్పాటు చేస్తామని మెలిక పెట్టారు.



ప్రభుత్వ భూమిలో వేసిన ఫెన్సింగ్

దీనిపై బాధితురాలు కన్నీటిపర్యంతమయ్యారు. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా తహసీల్దార్ బేఖాతర్ చేయడంపై మండిపడ్డారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన తహసీల్దారు స్థానిక టీడీపీ నేతకు కొమ్ముకాస్తే మాలాంటి పేదల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని స్పష్టం చేశారు.

పకడ్బందీగా శాంతిభద్రతల పరిరక్షణ

చిత్తూరు అర్బన్ : శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్టు కర్నూలు రేంజ్ హోమ్‌గార్డ్ కమాండెంట్ మహేష్‌కుమార్ తెలిపారు. చిత్తూరులోని ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆఫీస్‌లో శనివారం హోమ్‌గార్డ్ యూనిట్ల ఆధ్వర్యంలో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 403 మంది హోమ్‌గార్డులు పనిచేస్తున్నారని తెలిపారు. వారు ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను అరికట్టడంలో పోలీసులకు వెన్నుదన్నుగా ఉంటున్నారని వివరించారు. ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, హోమ్ గార్డ్స్ డీఎస్పీ చిరంజీవి, ఆర్‌ఐ ఎంటీవో భాస్కర్, ఆర్‌ఐ హోమ్ గార్డులు సుధాకర్ పాల్గొన్నారు.

ముగ్గురు ఎంపీడీఓల బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జెడ్పీ సీఈవో గ్లోరియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఎన్‌కండ్రిగ ఎంపీడీఓ సాయి లహరిని కుప్పానికి, అక్కడ ఉన్న ఖాదర్‌బాషాను బీఎన్‌కండ్రిగకు మార్చారు. శాంతిపురం ఎంపీడీఓగా వెదురుకుప్పం ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను, రామకుప్పానికి ఏర్పేడు ఎంపీడీఓ గిడ్డయ్యను బదిలీ చేశారు. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

'విశ్వకర్మ' రిజిస్ట్రేషన్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : పీఎం విశ్వకర్మ యోజన పథకానికి అర్హులైన వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ పథకం పొందేందుకు గ్రామ, వార్డు సచివాలయం, సీఎస్‌సీ సెంటర్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ పథకం కింద 5 శాతం వడ్డీకి రూ.3 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. సాంప్రదాయ చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఈ పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కళాకారులు, చేనేత కార్మికులకు సర్టిఫికెట్‌తో పాటు గుర్తింపుకార్డు సైతం అందజేయనున్నట్లు తెలిపారు. 5 శాతం వడ్డీతో తొలి విడతలో రూ.లక్ష వరకు, రెండో విడతలో రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చని వివరించారు. ప్రాథమిక స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ట్రైనీలకు రోజూ రూ.500 చొప్పున ఆర్థిక సహాయం, పనిముట్లు అవసరమైన వారికి రూ.15 వేల విలువ చేసే కిట్ అందిస్తామని వెల్లడించారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, రేషన్‌కార్డు, ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్, పాస్‌కార్డు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.యశ్వంత్, ఎం.సంధ్య, ఎం.ముపేష్ నాయుడు, టి.భువనేశ్వరి, జి.త్రిష, ఎం.మునిలక్ష్మి, డి.రేవంత్, కెడి.లక్ష్మి, ఎం.దిలీప్‌తో పాటు 54.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

ఆస్పత్రిలో భద్రతపై దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

కాణిపాకం: చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో భద్రత కరువుపై అధికారుల కన్ను పడింది. సాక్షిలో శుక్రవారం 'ఆస్పత్రిలో భద్రత కరువు' పేరుతో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ఆస్పత్రి అధికారులు స్పందించారు. మహిళా డాక్టర్ల భద్రతపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది సమక్షంలోనే ఆస్పత్రిని పరిశీలించారు. ప్రత్యేక గదులు, మరుగుదొడ్ల సమస్యను సూపరింటెండెంట్ అరుణ్కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరు వెంటనే మరమ్మతు పనులు చేపడతామని అరుణ్ కుమార్ హామీ ఇచ్చారు.

గందరగోళంగా ఇసుక పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండలంలో ఇసుక సరఫరా శనివారం గందరగోళంగా మారింది. జీడీ నెల్లూరు మండలం చెర్లోపల్లె వద్ద ఇసుక కావాల్సిన వాళ్లు బిల్లు తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో ఇసుక తరలింపుదారులు, ట్రాక్టర్ యజమానులు మండిపడ్డారు. స్టాక్ పాయింట్ నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చెర్లోపల్లెలో బిల్లులు తీసుకోవడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్టాక్ పాయింట్ వద్ద ట్రాక్టర్లు నిలిపేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వంద మందికి పైగా బంగ్లా వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయన లేకపోవడంతో కలెక్టరేట్‌కు వెళ్లి తమ సమస్యలు విన్నవించారు. పాత పద్ధతిలోని బిల్లులు ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. సమస్య పరిష్కారమవడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.